సుపారీ ఇచ్చి.. బెల్టుతో కొట్టి..

- ప్రముఖ కన్నడ హీరో దర్శన్ కేసులో విస్తుపోయే నిజాలు
- ప్రియురాలిని వేధించడాన్ని తట్టుకోలేకే అభిమాని హత్య

రేణుకా స్వామి

బెంగళూరు, జూన్ 12: హత్య కేసులో అరెస్టయిన ప్రముఖ కన్నడ హీరో దర్శన్ నుంచి సేకరించిన వివరాలు పోలీసులను విస్తుపోయేలా చేసింది. తన అభిమానులను హత్య కోసం ఆయన ఉపయోగించినట్టు నిర్ధారించారు. తన ప్రియురాలు పవిత్ర గౌడపై అనుచిత వ్యాఖ్యలు చేశాడన్న కోపంతో రేణుకా స్వామి అనే వ్యక్తిని హత్య చేశాడన్న ఆరోపణలపై దర్శన్, పవిత్ర గౌడతో పాటు మరో 11 మందిని పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. తాజా విచారణ వివరాలు పోలీసులు బుధవారం వెల్లడించారు. వారి వివరాల ప్రకారం.. హతుడు రేణుకాస్వామి దర్శన్ అభిమాని. అయితే అతడు నటి పవిత్రా గౌడతో వివాహేతర సంబంధం పెట్టుకున్నట్టు వస్తున్న ఆరోపణలతో తమ హీరో పేరుప్రతిష్టలు దెబ్బతింటున్నాయని అతడు భావించేవాడు. దీంతో ఒక నకిలీ ఇన్‌స్టాగ్రామ్ ఖాతాను సృష్టించి పవిత్రకు అసభ్యకరమైన మెస్సేజ్‌లు పంపి వేధించేవాడు. దీంతో పవిత్ర ఈ విషయాన్ని దర్శన్‌కు చెప్పింది.

ఫ్యాన్స్‌తోనే హత్య చేయించి...

తన ప్రియురాలిని వేధిస్తున్న రేణుకా స్వామిపై ఆగ్రహించిన దర్శన్ తన ఫ్యాన్స్ క్లబ్‌కు చెందిన రాఘవేంద్ర, కార్తీక్, కేశవమూర్తిని సంప్రదించాడు. తమ అభిమాన హీరోనే తమ వద్దకు వచ్చి సాయం అడగటంతో వారు కూడా దానికి ఆనందంగా ఒప్పుకున్నారు. దీంతో సుపారీ కింద దర్శన్ తొలుత వారికి రూ.5 లక్షలు ఇచ్చాడు. తన పేరు బయటకు రాకూడదని, వారు అరెస్టయితే అవసరమైన లీగల్ ఖర్చులు కూడా భరిస్తానని చెప్పాడు. దీంతో ఈ నెల 8న రేణుకాస్వామిని అతని ఇంటి సమీపంలో అడ్డగించిన దర్శన్ అభిమానులు అతడిని కామాక్షి పాల్యలోని ఒక షెడ్‌లోకి తీసుకెళ్లారు. అక్కడికి వచ్చిన దర్శన్ బెల్టుతో స్వామిని చితకబాదాడు. తర్వాత దర్శన్ అభిమానులు కూడా అతడిని విపరీతంగా కొట్టడంతో స్వామి మరణించాడు. దీంతో ఈ విషయాన్ని నిందితులు దర్శన్‌కు తెలియజేసి , పరిస్థితిని చక్కదిద్దడానికి మరో రూ.25 లక్షలు తీసుకున్నారు. రేణకా స్వామి మృతదేహాన్ని ఒక మురుగు కాల్వలో పడేశారు. కాగా.. పోలీసులు బుధవారం పవిత్ర, దర్శన్‌లను హత్య జరిగిన షెడ్ దగ్గరకు తీసుకుని వెళ్లి విచారణ జరిపారు.

ఇజ్రాయెల్‌పై హెజ్బుల్లా రాకెట్ల వర్షం

బీరుట్: ఉజ్రాయిల్‌లో మరోసారి ఉద్రిక్తతలు నెలకొన్నాయి. బుధవారం ఉత్తర ఇజ్రాయెల్‌పై హెజ్బుల్లా దక్షిణ లెబనాన్ నుంచి దాదాపు 160 రాకెట్లతో విరుచుకుపడింది. ఇజ్రాయెల్, హెజ్బుల్లా మధ్య ఘర్షణ ప్రారంభమైన తర్వాత జరిగిన అతిపెద్ద దాడుల్లో ఇది ఒకటిగా భావిస్తున్నారు. ఈ దాడుల్లో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. కాగా, తమ కీలక కమాండర్ తలెబ్ సమీ అబ్దుల్లా హత్యకు ప్రతీకారంగా ఇజ్రాయెల్‌కు చెందిన రెండు మిలిటరీ బేస్‌లపై రాకెట్లు, మిస్సైళ్లతో దాడి చేశామని హెజ్బుల్లా ప్రకటించింది. ఇజ్రాయెల్, హమాస్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందానికి అమెరికాతో సహా అంతర్జాతీయ స్థాయిలో ప్రయత్నాలు జరుగుతున్న వేళ హెజ్బుల్లా ఈ దాడికి పాల్పడటంతో ఉద్రిక్తతలు మరోసారి పెరిగాయి. ఇప్పటివరకు లెబనాన్‌పై ఇజ్రాయెల్ జరిపిన దాడిలో 400 మంది హెజ్బుల్లా సభ్యులు మరణించినట్టు తెలుస్తున్నది.

ఢిల్లీలో ట్యాంకర్ మాఫియాపై సుప్రీంకోర్టు ఆగ్రహం

న్యూఢిల్లీ: దేశ రాజధాని నగరంలో తీవ్ర నీటి సంక్షోభం నేపథ్యంలో ఢిల్లీ రాష్ట్ర ప్రభుత్వంపై సుప్రీంకోర్టు బుధవారం మండిపడింది. ట్యాంకర్ మాఫియా, నీటి వృథాలపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని నిలదీసింది. నీటి వృథా నివారణకు చేపట్టిన చర్యలను వివరించాలని ఆదేశించింది. ట్యాంకర్ మాఫియాను రాష్ట్ర ప్రభుత్వం అరికట్టలేకపోతే, తాము స్పందించి, తగిన చర్యలు తీసుకోవాలని ఢిల్లీ పోలీసులను కోరుతామని న్యాయమూర్తులు తెలిపారు. హిమాచల్ ప్రదేశ్ నుంచి నీరు వస్తున్నప్పటికీ, కోర్టు సమక్షంలో తప్పుడు ప్రకటనలు ఎందుకు చేస్తున్నారని ప్రశ్నించారు. నీటి సంక్షోభం గురించి మీడియా చానళ్ల కవరేజ్‌ని తాము చూస్తున్నామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై కోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది.

విద్యలో మెరుగు.. రాజకీయాల్లో వెనకడుగు

- భారత్‌లో మహిళల పరిస్థితిపై డబ్ల్యూఈఎఫ్ అభిప్రాయం
- ప్రపంచ లింగ వ్యత్యాస సూచీలో రెండు స్థానాలు కిందకు

న్యూఢిల్లీ, జూన్ 12: ప్రపంచ ఆర్థిక వేదిక(డబ్ల్యూఈఎఫ్) బుధవారం విడుదల చేసిన లింగ వ్యత్యాస సూచీలో భారత్ ఈ ఏడాది రెండు స్థానాలు దిగజారి 129వ స్థానంలో నిలిచింది. 146 దేశాల జాబితాలో ఐస్‌లాండ్ అగ్రస్థానం దక్కించుకోగా, సూడాన్ చివరి స్థానంలో నిలిచింది. ఆదాయం, రాజకీయ ప్రాతినిధ్యం, విద్య తదితర అంశాలపై అధ్యయనం ఆధారంగా రూపొందించిన నివేదికలో ఐస్‌ల్యాండ్ 93.5%, భారత్ 64.1% స్కోర్ సాధించాయి. ప్రపంచం మొత్తంగా 68.5 శాతం స్కోరు సాధించిందని, పూర్తి లింగ సమానత్వం సాధించేందుకు మరో 134 ఏండ్లు లేదా ఐదు తరాలు పడుతుందని డబ్ల్యూఈఎఫ్ నివేదిక అభిప్రాయపడింది. దక్షిణాసియా దేశాల వరకు చూస్తే లింగ వ్యత్యాస సూచీలో భారత్ కంటే బంగ్లాదేశ్, నేపాల్, శ్రీలంక, భూటాన్ ముందు స్థానాల్లో ఉండటం గమనార్హం. ఇక పాకిస్థాన్ చివరి నుంచి రెండవ(145వ) స్థానంలో ఉన్నది.

ఆర్థిక లింగ సమానత్వం తక్కువ ఉన్న దేశాల్లో బంగ్లాదేశ్, సూడాన్, ఇరాన్, పాకిస్థాన్, మొరాకో సహా భారత్ కూడా ఉన్నది. అయితే ఈ స్కోర్ గత నాలుగేండ్లుగా స్వల్పంగా పెరుగుతున్నదని నివేదిక తెలిపింది. అయితే సెకండరీ విద్యలో భారత్ మెరుగైన లింగ సమానత్వం చూపిందని పేర్కొన్నది. మహిళల రాజకీయ సాధికారత విషయంలో భారత్ ఇంకా వెనుకబడి ఉన్న విషయాన్ని నివేదిక ఈ సందర్భంగా స్పష్టం చేసింది. మంత్రి పదవుల్లో కేవలం 6.9 శాతం, పార్లమెంట్‌లో 17.2 శాతం మంది మాత్రమే మహిళలు ఉన్నారని తెలిపింది. మహిళల రాజకీయ సాధికారత విషయంలో భారత్ ప్రపంచంలో 65 ర్యాంకులో ఉన్నదని డబ్ల్యూఈఎఫ్ వెల్లడించింది.

డిప్యుటేషన్‌పై ఐపీఎస్‌లను పంపండి

రాష్ట్రాలకు కేంద్ర హోం శాఖ లేఖ

న్యూఢిల్లీ: కేంద్రానికి డిప్యుటేషన్‌పై ఐపీఎస్ అధికారులను పంపించాలని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలను కేంద్ర హోం శాఖ (ఎంహెచ్ఏ) రెండోసారి కోరింది. సెంట్రల్ పోలీస్ ఆర్గనైజేషన్స్ (సీపీఓ), సెంట్రల్ ఆర్మ్డ్ పోలీస్ ఫోర్సెస్ (సీఏపీఎఫ్)లలో ఖాళీల భర్తీ కోసం ఈ లేఖను రాసింది. ఎస్‌పీ, ఐజీ ర్యాంక్ అధికారులను పంపించేందుకు సిఫారసులను తగిన స్థాయిలో పంపించడం లేదని గుర్తు చేసింది. జూన్ 3నాటికి ఎస్‌పీ స్థాయిలో 129 ఖాళీలు ఉన్నాయని తెలిపింది. అదే విధంగా డీఐజీ ర్యాంక్ ఖాళీలు 81, ఐజీ స్థాయి అధికారుల ఖాళీలు 25 ఉన్నాయని తెలిపింది. ఎస్పీ స్థాయి ఖాళీలు సీబీఐలో 54, ఎన్ఐఏలో 13 ఉన్నట్లు వివరించింది. హిమాచల్ ప్రదేశ్, నాగాలాండ్, సిక్కిం, త్రిపుర మినహా మిగిలిన రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులకు ఈ లేఖను రాసింది.

అయోధ్యలో తగ్గిన రద్దీ

- వ్యాపారాలు తగ్గాయని స్థానికుల ఆవేదన
- బీజేపీ ఓటమీ ఒక కారణమన్న విశ్లేషకులు

అయోధ్య, జూన్ 12: ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్యలో గత వారం రోజులుగా భక్తుల రద్దీ భారీగా తగ్గిపోయింది. లోక్‌సభ ఎన్నికల ప్రకటనకు ముందు అయోధ్యలో నూతన రామ మందిరం ప్రారంభమైంది. అప్పటి నుంచి దేశ నలుమూలల నుంచి పెద్ద ఎత్తున భక్తులు అయోధ్యకు వెళ్లి బాల రాముడిని దర్శించుకున్నారు. దీంతో స్థానికంగా చిన్న చిన్న వ్యాపారాలు చేసుకునేవారికి, రిక్షా డ్రైవర్లకు చేతి నిండా పని దొరికేది. అయితే, గత వారం రోజులుగా మాత్రం అయోధ్యలో భక్తుల రాక తగ్గిపోయిందని స్థానికులు చెప్తున్నారు. ఇంతకు ముందు రామమందిరం, హనుమాన్‌గర్హి పరిసరాలు మొత్తం భక్తులతో కిటకిటలాడేవని, ఇప్పుడు భక్తుల సంఖ్య భారీగా తగ్గిపోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో తమకు సరిగ్గా పని దొరకడం లేదని, వ్యాపారాలు నడవడం లేదని స్థానికులు వాపోతున్నారు. గతంలో ఎలక్ట్రిక్ రిక్షా నడపడం ద్వారా రోజుకు రూ.500 – రూ.800 వరకు వచ్చేవని, ఇప్పుడు రూ.200 – రూ.250 రావడం కూడా కష్టంగా ఉందని డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయోధ్య ఉన్న ఫైజాబాద్ లోక్‌సభ నియోజకవర్గంలో బీజేపీ ఓడిపోవడమూ అయోధ్యలో రద్దీ తగ్గడానికి, వ్యాపారాలు మందగించడానికి ఒక కారణమని విశ్లేషకులు అంటున్నారు.

పోక్సో కేసులో యెడియూరప్పకు నోటీసులు

బెంగళూరు: కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి బీఎస్ యెడియూరప్పకు సీఐడీ బుధవారం నోటీసులిచ్చింది. 17 ఏళ్ల మైనర్ బాలికను లైంగికంగా వేధించినట్లు ఆయనపై మార్చిలో కేసు నమోదైంది. ఫిబ్రవరి 2న ఓ సమావేశంలో ఆయన ఈ దుశ్చర్యకు పాల్పడ్డారని బాధితురాలి తల్లి ఫిర్యాదు చేశారు. బీజేపీ వర్గాలు తెలిపిన సమాచారం ప్రకారం, యెడియూరప్ప ప్రస్తుతం ఢిల్లీలో ఉన్నారు. అక్కడి నుంచి తిరిగి వచ్చిన వెంటనే సీఐడీ దర్యాప్తునకు హాజరవుతారని తెలుస్తున్నది.

'మిగులు జలాల విడుదలను హిమాచలే రుజువు చేసుకోవాలి'

న్యూఢిల్లీ, జూన్ 12: సుప్రీం కోర్టు జూన్ ఆరున జారీ చేసిన ఆదేశాల మేరకు హిమాచల్ ప్రదేశ్ ప్రభుత్వం 137 క్యూసెక్కుల మిగులు జలాలను విడుదల చేస్తున్న విషయాన్ని ఆ ప్రభుత్వమే రుజువు చేయాలని ద అప్పర్ యమున రివర్ బోర్డు (యూవైఆర్‌బీ) సర్వోన్నత న్యాయస్థానానికి తెలిపింది. ప్రస్తుతం దేశ రాజధాని ఎదుర్కొంటున్న నీటి సమస్య పరిష్కారానికి 137 క్యూసెక్కుల మిగులు జలాలను దేశ రాజధాని ఢిల్లీతో పాటు హర్యానాకు విడుదల చేయాలంటూ సుప్రీం కోర్టు హిమాచల్ ప్రదేశ్ ప్రభుత్వాన్ని ఆదేశించింది. అయితే ఈ ఆదేశాల ప్రకారం అది నీటిని విడుదల చేస్తున్నది, లేనిదీ అంచనా వేసే పరిస్థితిలో బోర్డు లేదని యూవైఆర్‌బీ తన అఫిడవిట్‌లో స్పష్టం చేసింది.

కోర్టులోనే లంచం చెల్లింపు

- రక్తం శాంపిళ్లను మార్చడంలో డాక్టర్ అజయ్ సిద్ధహస్తుడు
- పుణె పోర్షే కారు కేసులో విస్తుపోయే వాస్తవాలు వెలుగులోకి

డాక్టర్ అజయ్ తావడే

పుణె: పుణెలో గత నెల 19న జరిగిన పోర్షే కారు ప్రమాదం కేసులో తవ్విన కొద్దీ దారుణాలు వెలుగు చూస్తున్నాయి. మైనర్‌ను ఈ కేసు నుంచి తప్పించేందుకు జువెనైల్ జస్టిస్ బోర్డు ప్రాంగణంలోనే లంచాన్ని చెల్లించినట్లు దర్యాప్తులో బయటపడటం విస్మయపరుస్తున్నది. పోర్షే కారును విచక్షణారహితంగా నడిపి ఇద్దరు దంపతుల ప్రాణాలు తీసిన మైనర్ రక్తం శాంపిళ్లు తారుమారైనట్లు పోలీసులు చెప్పిన సంగతి తెలిసిందే. మైనర్ బాలుని రక్తానికి బదులుగా అతని తల్లి రక్తాన్ని పరీక్షించి, నివేదిక ఇచ్చేందుకు రూ.3 లక్షలు లంచం చెల్లించారని పోలీసు దర్యాప్తులో తెలిసింది. నిందితుని తండ్రి విశాల్ అగర్వాల్ ఈ సొమ్మును సస్సూన్ హాస్పిటల్ వార్డ్ బాయ్ అతుల్ ఘట్కాంబ్లేకు ఇచ్చినట్లు పోలీసులు గుర్తించారు. మరోవైపు ఈ కేసులో నిందితుడైన డాక్టర్ అజయ్ తావడే పెద్ద నెట్‌వర్క్‌ను నడుపుతున్నట్లు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ ఓ పత్రిక తెలిపింది. అజిత్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీకి చెందిన ఓ మంత్రి, ఎమ్మెల్యే సిఫారసు మేరకు డాక్టర్ తావడే సస్సూన్ హాస్పిటల్ ఫోరెన్సిక్ మెడికల్ డిపార్ట్‌మెంట్ హెడ్‌గా నియమితులైనట్లు తెలుస్తున్నది. ఈ డాక్టర్ గతంలో కూడా చాలా మందికి ఇదే విధంగా రక్త నమూనాలను మార్చి, తప్పుడు ధ్రువీకరణ ప్రతాలు ఇచ్చినట్లు సమాచారం. మద్యం సేవించి, వాహనాన్ని నడిపి, ప్రమాదానికి గురైనపుడు ఈ డాక్టర్ నెట్‌వర్క్‌లోని బ్రోకర్లు రంగంలోకి దిగుతారని; కనీసం రూ.5 లక్షలు వసూలు చేసి, రక్తం శాంపిళ్లను మార్చి, మద్యం సేవించలేదని నివేదికలు వచ్చేలా చేస్తున్నారని తెలిసింది. ఇలా చేయడం వల్ల నిందితులకు స్వల్ప శిక్ష పడుతుంది. ఈ కేసులో నిందితుడైన మైనర్‌కు అబ్జర్వేషన్ హోమ్ రిమాండ్‌ను జువెనైల్ జస్టిస్ బోర్డ్ ఈ నెల 25 వరకు పొడిగించింది.

ఉద్యోగినులతో మస్క్ శృంగారం!

వాల్‌స్ట్రీట్ జర్నల్‌లో సంచలన కథనం

న్యూయార్క్, జూన్ 12: స్పేస్‌ఎక్స్ సీఈవో ఎలాన్ మస్క్‌పై వాల్‌స్ట్రీట్ జర్నల్‌లో సంచలన కథనం ప్రచురితమైంది. మస్క్ తన కంపెనీలో పని చేసిన ఇద్దరు ఉద్యోగినులతో శృంగారంలో పాల్గొన్నాడని, తనతో పిల్లల్ని కనాలని వారిపై ఒత్తిడి చేశాడని ఈ కథనం పేర్కొన్నది. స్పేస్‌ఎక్స్‌లో పని చేసి 2013లో బయటకు వచ్చేసిన ఓ మహిళ మస్క్‌పై ఈ ఆరోపణలు చేశారు. ప్రపంచం జనాభా సంక్షోభంలో ఉందని, అధిక ఐక్యూ కలిగిన పిల్లలను కనాలని మస్క్ చెప్పేవాడని మహిళ పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి వీరి మధ్య జరిగిన సంభాషణను సైతం ఈ కథనంలో ప్రచురించారు. అంతేకాదు, స్పేస్‌ఎక్స్, టెస్లా కంపెనీల్లో మస్క్ మహిళా వ్యతిరేక వాతావరణం సృష్టించాడని సైతం ఈ కథనం పేర్కొన్నది. మస్క్‌పై ఈ తరహా వివాదాస్పద ఆరోపణలు రావడం కొత్తేమీ కాకపోవడం గమనార్హం.

ఉక్రెయిన్ యుద్ధంలో ఇద్దరు భారతీయుల మృతి

న్యూఢిల్లీ, జూన్ 12: రష్యా సైన్యం నియమించుకొన్న మరో ఇద్దరు భారతీయులు రష్యా–ఉక్రెయిన్ యుద్ధంలో ఇటీవల మరణించారని భారత విదేశాంగ శాఖ బుధవారం వెల్లడించింది. దీంతో ఈ యుద్ధంలో మరణించిన భారతీయుల సంఖ్య నాలుగుకు చేరిందని తెలిపింది. ఈ తీవ్రమైన అంశాన్ని రష్యా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని, ఆ దేశం తన సైన్యంలో నియమించుకొన్న భారతీయులందరినీ వెనక్కు పంపాలని కోరామని తెలిపింది. భారతీయులను ఇకపై సైన్యంలో నియమించుకోవడం ఆపాలని డిమాండ్ చేశామని పేర్కొన్నది. రష్యా సైన్యానికి సెక్యూరిటీ హెల్పర్లుగా నియమించుకొన్న పలువురు భారతీయులను యుద్ధంలోకి దింపడంతో.. కొందరు ప్రాణాలు కోల్పోతున్న విషయం తెలిసిందే. మరోవైపు యుద్ధాన్ని ఆపేందుకు త్వరలో దౌత్యపరమైన ప్రయత్నాలు జరుగనుండగా.. రష్యా దళాలు బుధవారం ఉక్రెయిన్‌లోని కీవ్ రీజియన్‌పైకి క్షిపణులు, డ్రోన్ల వర్షం కురిపించింది. వాటన్నింటినీ కూల్చివేశామని ఉక్రెయిన్ అధికారులు వెల్లడించారు.

'గల్ఫ్' ఆశలు అడియాశలు

- వీసా కోసం ఇంటర్వ్యూకు వెళ్తుండగా బైక్‌ను ఢీకొట్టిన డీసీఎం
- అక్కడికక్కడే ఇద్దరు మృతి

షేక్ అబ్దుల్లా, సయ్యద్ చాంద్ (ఫైల్)

గంభీరావుపేట, జూన్ 12: ఇద్దరు యువకులు బయటి దేశానికి వెళ్లడానికి వీసా కోసం ఇంటర్వ్యూకు వెళ్తుండగా.. ఓ డీసీఎం బైక్‌ను ఢీకొట్టడంతో ఇద్దరూ అక్కడికక్కడే మృతిచెందారు. దీంతో గల్ఫ్‌కు వెళ్లాలన్న వారి ఆశలు అడియాశలయ్యాయి. ఈ ఘటన బుధవారం రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేటలో చోటుచేసుకుంది. కామారెడ్డి జిల్లా బిక్నూర్ మండలం మల్లుపల్లికి చెందిన షేక్‌అబ్దుల్లా(32), సయ్యద్‌చాంద్(38) కూలి పని చేసేవారు. మస్కట్‌కు వెళ్లేందుకు వీసా ఇంటర్వ్యూ కోసం బుధవారం ఉదయం మల్లుపల్లి నుంచి సిరిసిల్లకు బైక్‌పై బయలుదేరారు. గంభీరావుపేట మండలం కామారెడ్డి–సిరిసిల్ల ప్రధాన రహదారి పెద్దమ్మ అటవీ ప్రాంతానికి చేరుకోగానే ఎదురుగా వస్తున్న డీసీఎం బైక్‌ను ఢీకొట్టింది. అబ్దుల్లా, చాంద్‌కు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందారు. రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందడంతో మల్లుపల్లిలో విషాదం నెలకొంది. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రామ్మోహన్ తెలిపారు.

ఏపీ ముఖ్యమంత్రిగా బాబు ప్రమాణం

మొదటిపేజీ తరువాయి...

ప్రధాని నరేంద్ర మోదీతోపాటు కేంద్ర హోంమంత్రి అమిత్ షా, రవాణా మంత్రి నితిన్ గడ్కరీ, బీజేపీ జాతీయాధ్యక్షుడు, కేంద్రమంత్రి జేపీ నడ్డా, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, పలువురు కేంద్రమంత్రులు, సుప్రీంకోర్టు మాజీ చీఫ్ జస్టిస్ ఎన్‌వీ రమణ, సినీ నటులు చిరంజీవి, రజినీకాంత్, రామ్‌చరణ్, మహారాష్ట్ర సీఎం ఏక్‌నాథ్ షిండే, ఎల్జేపీ చీఫ్, కేంద్రమంత్రి చిరాగ్ పాశ్వాన్, మాజీ గవర్నర్ తమిళిసై తదితరులు హాజరయ్యారు. మంత్రుల ప్రమాణం కార్యక్రమం ముగిసిన అనంతరం చంద్రబాబు తన కుటుంబ సభ్యులతో కలిసి తిరుమల వెళ్లారు. గురువారం ఉదయం శ్రీవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపి, సాయంత్రం అమరావతికి చేరుకోనున్నారు.

నాలుగోసారి ముఖ్యమంత్రిగా..

చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణం చేయడం ఇది నాలుగోసారి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి రెండుసార్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబునాయుడు.. నవ్యాంధ్రప్రదేశ్‌కు సీఎం కావడం ఇది రెండోసారి. చంద్రబాబు మంత్రివర్గంలో తొలిసారి ఎమ్మెల్యేలుగా గెలిచిన 10 మందికి చోటు దక్కింది. గతంలో పలుమార్లు ఎమ్మెల్యేలుగా గెలిచిన ఏడుగురు మొదటిసారి మంత్రులయ్యారు. మంత్రుల్లో జనసేన నుంచి ముగ్గురు, బీజేపీ నుంచి ఒకరికి స్థానం కల్పించారు. కాగా మంత్రిపదవులు ఆశించిన పలువురు సీనియర్లకు నిరాశే మిగిలింది. వీరిలో గోరంట్ల బుచ్చయ్యచౌదరి, అయ్యన్నపాత్రుడు, ధూళిపాళ్ల నరేంద్ర, గంటా శ్రీనివాసరావు, యరపతినేని, బొండా ఉమ, గద్దె రామ్మోహన్, బాలకృష్ణ, పరిటాల సునీత, కోట్ల సూర్య ప్రకాశ్‌రెడ్డి, కన్నా లక్ష్మీ నారాయణ తదితరులు ఉన్నారు.

సీఎం ముఖ్యకార్యదర్శిగా ముద్దాడ రవిచంద్ర

ఏపీ సీఎం ముఖ్యకార్యదర్శిగా ముద్దాడ రవిచంద్ర నియమితులయ్యారు. సీఎంగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం అయిన కొద్ది నిమిషాల్లోనే ఏపీ చీఫ్ సెక్రటరి నీరబ్‌కుమార్ సీఎం ముఖ్యకార్యదర్శిగా రవిచంద్రను నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు. తక్షణమే బాధ్యతలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశాల్లో పేర్కొంది.

నేడు బాబు బాధ్యతల స్వీకరణ

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన చంద్రబాబు నాయుడు గురువారం సాయంత్రం 4.41గంటలకు బాధ్యతలు చేపట్టనున్నారు. వెంటనే ఆయన ఐదు ఫైళ్లపై సంతకం చేయనున్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి హోదాలో మెగా డీఎస్సీపై తొలి సంతకం, ల్యాండ్ టైటిలింగ్ చట్టం రద్దుపై రెండో సంతకం, పింఛను రూ.4వేలకు పెంచుతూ మూడో సంతకం, స్కిల్ సైన్సెస్‌పై నాలుగో సంతకం, అన్న క్యాంటీన్లపై ఐదో సంతకం చేయనున్నారు. దీనికి సంబంధించిన ఫైళ్లను అధికారులు సిద్ధం చేస్తున్నారు.

ఫోన్ల ట్యాపింగ్ నిందితులకు బెయిల్ నిరాకరణ

- ప్రభాకర్‌రావు, శ్రావణ్‌కుమార్ అరెస్టుకు రంగం సిద్ధం

నాంపల్లి కోర్టులు, జూన్ 12 (నమస్తే తెలంగాణ): ఫోన్ల ట్యాపింగ్ కేసులో రిమాండ్ ఖైదీలుగా కొనసాగుతున్న అదనపు ఎస్పీలు భుజంగరావు, తిరుపతన్నకు కోర్టులో చుక్కెదురైంది. బెయిల్ కోసం వారు దాఖలు చేసుకున్న పిటిషన్లను నాంపల్లి కోర్టు తిరస్కరించింది. ఈ మేరకు 1వ సెషన్స్ జడ్జి రమాకాంత్ బుధవారం తీర్పు వెల్లడించారు. ప్రస్తుతం ఈ కేసు విచారణ కీలక దశలో ఉన్నందున నిందితులకు బెయిల్ మంజూరు చేయరాదని ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ (పీపీ) చేసిన వాదనతో న్యాయమూర్తి ఏకీభవించారు. కాగా, ఈ కేసులో ప్రధాన నిందితుడైన స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో (ఎస్ఐబీ) మాజీ చీఫ్ ప్రభాకర్‌రావుతో పాటు ఆరవ నిందితుడిగా ఉన్న ఓ మీడియా సంస్థ ప్రతినిధి శ్రావణ్ కుమార్‌ను అదుపులోకి తీసుకునేందుకు అధికారులు రంగం సిద్ధం చేశారు. మరో నిందితుడైన ఎస్ఐబీ మాజీ అధికారి రాధాకిషన్‌రావు తన తల్లి కర్మకాండలో పాల్గొనేందుకు మధ్యంతర బెయిల్‌పై కొనసాగుతున్నారు.

తన్నుకున్న మంత్రి శ్రీధర్‌బాబు అనుచరులు

కన్నాలలో ఉద్రిక్తత.. ఠాణాలో ఫిర్యాదు.. ఇద్దరిపై కేసు

పాలకుర్తి, జూన్12: వారిద్దరూ మంత్రి శ్రీధర్‌బాబు అనుచరులు. ఒకరు పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం కన్నాల గ్రామానికి చెందిన డీసీసీ ప్రధాన కార్యదర్శి సూర సమ్మయ్య.. మరొకరు పెద్దపల్లి డీసీసీ సంయుక్త కార్యదర్శి గౌసియాబేగం. ఇందులో సమ్మయ్య అనుచరులు సూర సంతోష్, ఓల్లెపు రమేశ్.. గౌసియాబేగం సోదరుడు ఆరిఫ్ పాషాపై దాడి చేశారు. ఈ గొడవ బసంత్‌నగర్ ఠాణాకు చేరింది. బుధవారం రాత్రి బసంత్‌నగర్ పోలీస్‌స్టేషన్ వద్ద గౌసియాబేగం మాట్లాడుతూ.. సూర సమ్మయ్య కాంగ్రెస్‌లో ఉంటూనే.. పార్టీ శ్రేణులపై దాడులు చేయిస్తున్నారని విమర్శించారు. డబ్బు, అధికార బలంతో చిన్నస్థాయి నాయకులు, కార్యకర్తలను బెదిరిస్తున్నారని మండిపడ్డారు. బయ్యపు మనోహర్‌రెడ్డికి మద్దతుగా సోషల్ మీడియాలో పోస్టులు ఎందుకు పెడుతున్నావంటూ.. బుధవారం ఉదయం బసంత్‌నగర్ టోల్‌ప్లాజా వద్ద హోటల్‌లో ఆరిఫ్ పాషాపై సూర సంతోష్, ఓల్లెపు రమేశ్ కత్తులతో దాడి చేశారని తెలిపారు. రెండు వర్గాల నాయకులు మంత్రి శ్రీధర్‌బాబు అనుచరులే కావడంతో పోలీస్‌స్టేషన్ వద్ద పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఒక దశలో వందలాది మైనార్టీలు, వారి అనుచరులు పోలీస్టేషన్ ఎదుట రాస్తారోకో చేసేందుకు యత్నించారు. అఖిలపక్షం నాయకులు వద్దని చెప్పడంతో శాంతించారు. ఆరిఫ్ పాషాపై దాడిని కన్నాల, భామ్లానాయక్ తండా, రాణాపూర్ గ్రామాల నాయకులు ఖండించారు. ఆరిఫ్ పాషా ఠాణాలో ఫిర్యాదు చేయగా.. జీడీనగర్‌కు చెందిన సంతోష్, రమేశ్‌పై కేసు నమోదు చేసినట్టు బసంత్‌నగర్ ఎస్సై స్వామి తెలిపారు. ఆరిఫ్ పాషాపై జరిగిన దాడితో తనకు సంబంధ లేదని డీసీసీ ప్రధాన కార్యదర్శి సూర సమ్మయ్య చెప్పారు.

ప్రభుత్వ ఉపాధ్యాయుడి దారుణ హత్య

- ఆదిలాబాద్ జిల్లాలో ఘటన

నార్నూర్, జూన్ 12: ప్రభుత్వ ఉపాధ్యాయుడు దారుణ హత్యకు గురయ్యాడు. ఈ ఘటన ఆదిలాబాద్ జిల్లా గాదిగూడ మండలంలో బుధవారం చోటుచేసుకున్నది. కుటుంబసభ్యులు, నార్నూర్ సీఐ రహీంపాషా వివరాల ప్రకారం.. నార్నూర్ మండలం నాగల్‌కొండకు చెందిన జాదవ్ గజానంద్(40) జైనథ్ మండలం కెనాల్ మెడిగూడ గ్రామంలోని జడ్పీఎస్ఎస్‌లో తెలుగు పండిట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. బుధవారం పాఠశాలలు పునః ప్రారంభంకావడంతో గజానంద్ తన బైక్‌పై బయలుదేరాడు. అర్జుని పంచాయతీ పరిధిలోని కొలాంగూడ సమీపంలో ప్రధాన రహదారి మలుపు వద్ద గజానంద్ మృతదేహం కనిపించింది. సమాచారం అందుకున్న ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్, నార్నూర్ సీఐ రహీం పాషా ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. గుర్తు తెలియని వ్యక్తులు అడ్డగించి రాళ్లతో కొట్టి హతమార్చినట్టు అనుమానం వ్యక్తంచేశారు. డాగ్‌స్క్వాడ్‌తో ఆధారాలు సేకరించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మ